సాక్షి పెద్దపల్లి

గురువారం । 17 । ఆగస్టు । 2023



పథకాలు నచ్చి చేరికలు

ధర్మారం: మండలంలోని రచ్చపల్లికి చెందిన కాంగ్రెస్ మండల కార్యదర్శి అన్వేష్ తన అనుచరులతో రాష్ట్ర మంత్రి కొప్పుల ఈశ్వర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు.



శ్రావణం.. శుభకరం.

శ్రావణమాసం అందరికీ శుభకరం. నేటినుంచి ప్రతీ ఇల్లు ఆలయాలను తలపిస్తుంటాయి. ఉదయం, సాయంత్రం భగవన్నామస్మరణతో మార్మోగుతుంటాయి.

8లో▸

గరిష్టం/కనిష్టం

32.0/26.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. వాతావరణం పొడిగా ఉంటుంది. కొన్ని చోట్ల చిరుజల్లులు కురిసే అవకాశముంది.

కారులో 'అసమ్మతి'

టికెట్లు ప్రకటించే వేళ గుప్పుమంటున్న సెగ

- రామగుండం, మంథనిలో బయటపడిన లుకలుకలు
- పెద్దపల్లిలో నివురుగప్పిన నిప్పులా పరిస్థితి
- బీఆర్ఎస్‌లో ఆసక్తిగా మారుతున్న రాజకీయాలు
- అధినేత మదిలో ఏముందోనని అందరిలోనూ టెన్షన్



సాక్షి, పెద్దపల్లి: త్వరలో అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్నాయి. అదే సమయంలో బీఆర్ఎస్ తొలివిడత జాబితా ప్రకటించనుందనే వార్తలు వస్తున్నాయి. ఈ క్రమంలో గులాబీ పార్టీలో అసమ్మతి రాగం పెరుగుతోంది. నియోజకవర్గాల వారీగా సామాజిక సమీకరణలు, పనితీరు, బలబలాలు తదితర అంశాలు బేరిజు వేసుకున్న పార్టీ అధినేత.. అభ్యర్థులతో మొదటి జాబితాను ప్రకటించే అవకాశం ఉందన్న సంకేతాలతో అందరిలోనూ టెన్షన్ నెలకొంది. దీంతో అసమ్మతి నేతలు ఇదే అదనుగా వారికి టికెట్ కేటాయించొద్దంటూ ప్రకటనలు విడుదల చేస్తుండటం చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే జిల్లాలోని రామగుండంలో అసమ్మతి సెగ రగలగా.. అది పెద్దపల్లికి.. తాజాగా మంథనికి చేరుకుంది. దీంతో కారులో సీటు ఎవరికి దక్కనుందోననేది హాట్‌టాపిక్‌గా మారింది.

'కోరుకంటి'కి మాత్రం టికెట్ ఇవ్వొద్దు

జిల్లాలో మొదట రామగుండం నియోజకవర్గంలోని పలువురు ఆశావహులు రహస్యంగా సమావేశమై ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌కు తప్ప ఎవరికి టికెట్ ఇచ్చినా గెలిపించుకుంటామని ప్రకటించారు. ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా ఏకంగా పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకపోతామంటూ ప్రజా ఆశీర్వాదయాత్ర పేరుతో పాదయాత్ర నిర్వహించారు. ఆ పంచాయితీ మంత్రి కేటీఆర్ వద్దకు చేరింది. కేటీఆర్ వారిని రాజధాని హైదరాబాద్‌కు పిలిపించుకుని పార్టీకి వ్యతిరేకంగా ఎలాంటి కార్యక్రమాలూ నిర్వహించొద్దని, రామగుండంకు ఇన్‌చార్జిగా మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను నియమించామని తెలిపారు. దీంతో వివాదం సద్దుమణిగిందని అందరూ భావించారు. అయితే ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఆశావహులను కలిసేందుకు చేసిన ప్రయత్నాలు వికటించాయి. మంత్రి కొప్పుల తన నివాసంలో అసమ్మతి నేతలతో భేటీకాగా.. ఎమ్మెల్యే చందర్ వారిని అక్కడే కలిశారు. ఈ క్రమంలో నేతలందరూ కలిసిపోయారంటూ కోరుకంటి వర్గం సోషల్‌మీడియాలో ప్రచారం చేసుకుంది. దీనిపై సదరు నాయకులు మాత్రం తాము ఎమ్మెల్యేను కలవలేదని, మంత్రిని కలవడానికి వెళ్లగా.. ఎమ్మెల్యే ఆకస్మికంగా అక్కడికి వచ్చారని వివరణ ఇచ్చుకున్నారు. కేసీఆర్ ప్రకటించే జాబితాను బట్టి భవిష్యత్ కార్యాచరణ చేయాలని ఇటీవల మరోమారు సమావేశమై చర్చించుకున్నారు. తాజాగా ముత్తారంలో సుమా రు 150మంది స్థానిక ప్రజాప్రతినిధులు మంథని నుంచి ప్రస్తుత జెడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్‌కు టికెట్ ఇవ్వొద్దంటూ ప్రెస్‌మీట్ పెట్టడం.. త్వరలో నియోజకవర్గంలో పుట్ట మధుకు వ్యతిరేకంగా పాదయాత్ర చేపడతామని ప్రకటించడంతో గులా బీలో అసమ్మతి ఏ స్థాయికి చేరుతుందోనని బీఆర్ఎస్ కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఆత్మగౌరవం పేరుతో..

పెద్దపల్లి నియోజకవర్గంలో సిట్టింగ్ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డికి టికెట్ ఇవ్వొద్దని.. ఇస్తే తెలంగాణ భవన్ ముందు ధర్నా చేస్తానని మున్సిపల్ మాజీ చైర్మన్ రాజయ్య ప్రకటించడం అప్పట్లో సంచలనంగా మారింది. మాజీ ఎమ్మెల్యే బిరుదు రాజమల్లు, రాజయ్య, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సుమారు 500మంది పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో పార్టీ మారారు. స్థానిక ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదని, ఆత్మగౌరవం లేనిచోట ఉండలేమంటూ వారందరూ కండువా మార్చుకున్నారు. మరికొందరు సైతం పార్టీ మారేందుకు సిద్ధమవుతుండటం ఆసక్తి కలిగిస్తున్నాయి. బీసీవాదంతో జూలపల్లి జెడ్పీటీసీ బొద్దుల లక్ష్మణ్, నల్లా మనోహర్‌రెడ్డి టికెట్ ఆశిస్తున్నారు. వీరి అడుగులతో నియోజకవర్గంలో పక్క నియోజకవర్గాల మాదిరి అసమ్మతి సెగ అంటుకుంటుందో..? లేదో..? కొద్దిరోజుల్లో తేలనుంది.

సార్ 'మదిలో' ఎవరు..?

'క్షేత్రస్థాయిలో బాగా పనిచేయాలె.. వచ్చే ఎన్నికల్లో కూడా మనమే గెలుస్తం. ఇప్పుడున్న సిట్టింగ్ ఎమ్మెల్యేలే మళ్లీ పోటీ చేస్తరు..' ఇది గతంలో బీఆర్ఎస్ అధ్యక్షులు, సీఎం కేసీఆర్ అన్న మాటలు. ఈ ప్రకటన ఎమ్మెల్యేలకు ఊరటనివ్వగా.. సర్వేల ఆధారంగానే టికెట్లు ఇస్తామని, వెనకబడినవారికి చెప్పి చూస్తామని, మారకపోతే వారి ఖర్మ.. తీసి పక్కకు పడేస్తామని కేసీఆర్ చెప్పిన మాటలు ఆశావహులకు ఊరటనిస్తున్నాయి. ఇలా కేసీఆర్ గతంలో చేసిన ప్రకటనలు, సర్వే రిపోర్ట్స్ ఆధారంగా ఎవరికి వారే తమకే టికెట్ అంటూ నియోజకవర్గాల్లో హల్‌చల్ చేస్తున్నారు. మరికొందరు ఏకంగా బహిరంగంగా ×వారికి తప్ప టికెట్ ఎవరికి ఇచ్చినా పార్టీని గెలిపించుకుంటామంటూ ప్రెస్‌మీట్‌లు పెట్టి మరి చెబుతుండటం ఇప్పుడు జిల్లాలో హాట్‌టాపిక్‌గా మారుతోంది. ఐతే సిట్టింగ్‌లలో ఎవరిని మారుస్తారు..? ఎవరికి అవకాశం కల్పిస్తారు..? అసలు పెద్దసారు మదిలో ఎవరు ఉన్నారు..?అనేదానిపై తీవ్ర చర్చ సాగుతోంది.

సింగరేణిలో డిజిటల్ మస్టర్

- కోవిడ్‌తో నిలిచిన బయోమెట్రిక్ పునరుద్ధరణ
- ప్రస్తుతం జీఎం కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన అధికారులు
- భవిష్యత్‌లో గనులు, ఓసీపీలపై కూడా..



సింగరేణి ప్రధాన కార్యాలయం

సింగరేణి వ్యాప్తంగా	
భూగర్భగనులు	23
ఓసీపీలు	19
పనిచేస్తున్న ఉద్యోగులు:	42వేల మంది

గోదావరిఖని: సింగరేణి ఉద్యోగుల మస్టర్లను డిజిటలైజేషన్ చేయాలని, బయోమెట్రిక్ ద్వారా హాజరు నమోదును పునరుద్ధరించాలని యాజమాన్యం నిర్ణయించింది. కోవిడ్ కారణంగా నిలిచిపోయిన ఈ ప్రక్రియను పునఃప్రారంభించాలని సంస్థ వారం క్రితం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు ఉన్న జీఎం కార్యాలయం, డిపార్ట్‌మెంట్లలో పనిచేసే ఉద్యోగులు రిజిస్టర్‌లో సంతకం చేయడం, గనుల్లో మస్టర్ చెప్పే విధానానికి తెరపడనుంది. ఇప్పటికే ఈ ప్రక్రియ కొత్తగూడెం కార్పొరేట్ కార్యాలయంలో అమలవుతోంది. తాజాగా జీఎం కార్యాలయాలతోపాటు ఆసుపత్రులు, పలు డిపార్ట్‌మెంట్లలో బయోమెట్రిక్ హాజరు కొనసాగించాలని నిర్ణయించారు. సింగరేణి వ్యాప్తంగా 42వేల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీరందరి హాజరు ఇక డిజిటలైజేషన్ కానుంది.

గనుల్లో ఫేస్ రికగ్నైజేషన్

సింగరేణివ్యాప్తంగా ఓసీపీ, భూగర్భగనుల్లో పనిచేస్తున్న కార్మికుల హాజరును బయోమెట్రిక్ చేసేందుకు యాజమాన్యం నిర్ణయించింది. అయితే కార్మికుల వేలిముద్రలు సరిగా ఉండవు, వారికి బయోమెట్రిక్ హాజరు నమోదు కష్టంగా మారుతుంది. దీంతో ప్రత్యామ్నాయంగా వారికి ఫేస్‌రికగ్నైజేషన్ విధానం ద్వారా మస్టర్ కొనసాగించాలని భావిస్తున్నారు.

ఉచిత మస్టర్లకు చెల్లు చీటి

సింగరేణిలో బయోమెట్రిక్, ఫేస్ రికగ్నైజేషన్ విధానం ప్రారంభమైతే ఉచిత మస్టర్లకు చెల్లుచీటి పడనుంది. కొంతమంది నాయకులు గనులపై మస్టర్ పడి బయటకు వెళ్లడం, లేకుంటే కొందరి ద్వారా మస్టర్ చెప్పించుకుని గనిపైకి రాకుండానే తిరగడం ద్వారా సంస్థకు ఆర్థికంగా నష్టం వాటిల్లుతోంది. ఇలా ఒక్కో గనిపై పదిమంది వరకు ఉంటున్నారని అనధికారంగా చెబుతున్నారు. ఉచిత మస్టర్లకు అలవాటు పడి గనులపై రాకుండానే డ్యూటీలు వేయించుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. బయోమెట్రిక్, ఫేస్ రికగ్నైజేషన్ ద్వారా వీటన్నిటిని అరికట్టవచ్చనే ఆలోచనలో యాజమాన్యం ఉంది.

భవిష్యత్‌లో గనులు, ఓసీపీల్లో..

సింగరేణి వ్యాప్తంగా ఉన్న జీఎం కార్యాలయాలు, డిపార్ట్‌మెంట్లపై బయోమెట్రిక్ విధానం అమలు పూర్తయితే రెండోదశలో గనులు, ఓసీపీలపై బయోమెట్రిక్ లేదా ఫేస్ రికగ్నైజేషన్ విధానం అమలు చేసేందుకు యోచిస్తున్నారు. 11 ఏరియాల్లోని జీఎం కార్యాలయాలు, మూడు ఏరియా ఆసుపత్రులు, 6 డిస్పెన్సరీలు, సివిల్, వర్క్‌షాప్, స్టోర్స్‌లో ఈ విధానాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఉద్యోగులు విధులకు వచ్చే సమయం, డ్యూటీ పూర్తిచేసుకుని వెళ్లే సమయంలోనే ఈ విధానం పనిచేస్తుంది. మధ్యలో బయటకు వెళ్లే వారికి బయోమెట్రిక్ స్పందించదు. దీంతో తప్పనిసరిగా 8గంటలపాటు కార్మికులు విధుల్లో ఉండాల్సిందే. అంతే కాకుండా ఈ విధానం అమలైతే మస్టర్ వేసుకోవడానికి ప్రత్యేకంగా సిబ్బందిని నియమించాల్సిన అవసరం ఉండదు.

సాంకేతికతను వినియోగించుకుంటాం



సంస్థ వ్యాప్తంగా బయోమెట్రిక్ విధానాన్ని అమలుచేయాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేశాం. ప్రస్తుతం జీఎం కార్యాలయాల్లో కొనసాగుతుంది. దశలవారీగా డిపార్ట్‌మెంట్లు, ఆసుపత్రులు, గనులు, ఓసీపీలపై కూడా ఈ విధానాన్ని అమలు చేస్తాం. డ్యూటీకి హాజ రయ్యే కార్మికులను గుర్తించేందుకు ఉపయోగపడుతుంది.

– ఎస్.బలరాం, సింగరేణి డైరెక్టర్(పా)

న్యూస్‌రీల్

బొక్కలవాగుపై వంతెన స్థలం పరిశీలన



ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలిస్తున్న ఈఎన్‌సీ నల్లా వెంకటేశ్వర్లు, ఎస్ఈ సత్యరాజ్

మంథని: మంథని మున్సిపాలిటీ పరిధి కూచిరాజ్‌పల్లి వద్ద బొక్కలవాగుపై ప్రతిపాదిత వంతెన నిర్మాణ ప్రదేశాన్ని బుధవారం నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ నల్లా వెంకటేశ్వర్లు, ఎస్ఈ సత్యరాజ్‌చంద్ర పరిశీలించారు. వంతెన నిర్మాణానికి ప్రభుత్వం రూ.6కోట్లు మంజూరు చేసింది. కొద్దిరోజుల్లోనే టెండర్లు పిలువనున్న నేపథ్యంలో అధికారులు పరిశీలన చేశారు. ఏఈ తిరుపతి, తదితరులు ఉన్నారు.

రెండోరోజు గాంధీ సినిమా ప్రదర్శన



సినిమా తిలకిస్తున్న విద్యార్థులు

పెద్దపల్లిరూరల్: ఆజాదీకాఅమృత్ మహోత్సవ్‌లో భాగంగా జిల్లాలో 4,216 మంది విద్యార్థులు బుధవారం గాంధీచిత్రాన్ని వీక్షించారని డీఈవో మాధవి తెలిపారు. జిల్లాలోని ఏడు సినిమాహాళ్లలో చిత్రాన్ని ప్రదర్శిస్తున్నారని, విద్యార్థులను ఉపాధ్యాయులు, అధికారుల పర్యవేక్షణలో తీసుకుని వెళ్లి తిరిగి వస్తున్నారని వివరించారు.

అడిషనల్ కలెక్టర్‌తో సింగరేణి అధికారుల సమావేశం



అడిషనల్ కలెక్టర్‌తో సింగరేణి అధికారులు

గోదావరిఖని: అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్ లాల్‌తో సింగరేణి అధికారులు భూసేకరణ, ఆర్అండ్ఆర్ ప్యాకేజీ, తదితర అంశాలపై కలెక్టరేట్‌లో సమావేశమయ్యారు. గత సమావేశంలో చర్చించి ఆమోదించిన పనుల స్థితిగతులపై సమీక్షించారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జయశ్రీ, అడిషినల్ డైరెక్టర్ ఆఫ్ సర్వే, లాండ్ రికార్డ్స్ ఎం.శ్రీనివాస్, రవీందర్, రామగిరి తహసీల్దార్ బి.రాంచందర్‌రావు, ఆర్జీ–2 ఏరియా జీఎం ఏ.మనోహర్, ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్, ఆర్జీ–3 జీఎం సుధాకర్ రావు, సీనియర్ ఎస్టేట్స్ అధికారి సునీత, డిప్యూటీ మేనేజర్ సురేష్ బాబు, ఎస్టేట్స్ అధికారులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లు సత్తాచాటాలి



మాట్లాడుతున్న జిల్లా చైర్మన్ నర్సయ్య

ఓదెల: రానున్న ఎన్నికల్లో ముదిరాజ్‌లు సత్తాచాటాలని మత్స్యసహకార సంఘం జిల్లా చైర్మన్ కొలిపాక నర్సయ్య తెలిపారు. ఓదెలలో జరిగిన ఆత్మీయ మహోత్సవంలో పాల్గొన్నారు. జిల్లాలోని చెరువులు, కుంటల్లో చేపపిల్లలు పెంపకానికి కృషి చేస్తానన్నారు. చేప పిల్లలు రానివారు తన దృష్టికి తీసుకురావాలన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ముదిరాజ్ విజయం సాధించి అసెంబ్లీకి వెళ్లాలన్నారు. కార్పొరేటర్ కొలిపాక శ్రీనివాస్ మాట్లాడుతూ హుజూరాబాద్‌లో ఈటల రాజేందర్ గెలిచిన తరహాలోనే పెద్దపల్లిలో ముదిరాజ్‌లు గెలవాలన్నారు. కార్పొరేటర్లు కొలిపాక సంధ్య, శ్రీధర్, చిరంజీవి, నాయకులు రాయిల్ల రాజేశం, చొప్పరి రాజేశం, రేగుల తిరుపతి, నీర్ల శ్రీనివాస్, కనుకుంట్ల సాయిలు, ఈర్ల కుమార్, పిట్టల కొంరయ్య పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు దరఖాస్తులు ఆహ్వానం

పెద్దపల్లిరూరల్: జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈవో మాధవి తెలిపారు. ఈనెల 25లోగా ప్రతిపాదనలను డీఈఓ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. 15ఏళ్ల అనుభవం ఉన్న హెచ్‌ఎంలు, పదేళ్ల అనుభవమున్న టీచర్లు దరఖాస్తుకు అర్హులని పేర్కొన్నారు. వివరాలకు జిల్లా సైన్స్ అధికారి బి.రవినందన్ రావును సెల్ నంబర్ 99515 04622లో సంప్రదించాలని సూచించారు.

తడి, పొడి చెత్త వేర్వేరుగా అందిస్తున్నారా..?

జిల్లాలోని పలు గ్రామాల్లో కేంద్రబృందం ఆరా



ఎలిగేడు: ధూళికట్టలో సెగ్రిగేషన్ షెడ్డును పరిశీలిస్తున్న సెంట్రల్‌టీం సభ్యులు, అధికారులు

పెద్దపల్లిరూరల్: ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటున్నారా..? వ్యక్తిగత మరుగుదొడ్డిని వినియోగిస్తున్నారా..? ఇంట్లోంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందిస్తున్నారా..? అంటూ కేంద్రబృంద సభ్యులు బుధవారం పెద్దపల్లి మండలం రంగాపూర్, తుర్కలమద్దికుంట గ్రామాల్లో ఆరా తీశారు. స్వచ్ఛసర్వేక్షణ్‌లో భాగంగా ఇప్పటికే ఓదెల, కాల్వశ్రీరాంపూర్ మండలాల్లో పనులు పరిశీలించారు. ఇంకుడుగుంతలతో భూగర్భజలాలు వృద్ధి చెందుతాయని అధికారులు వెంకటేశ్, ప్రశాంత్ తెలిపారు. వారివెంట రంగాపూర్, తుర్కలమద్దికుంట సర్పంచులు గంట లావణ్య, జయప్రద, ఎంపీఓ సుదర్శన్, ఏపీఎం సంపత్ పాల్గొన్నారు.

కల్వచర్లలో..

రామగిరి: మండలంలోని కల్వచర్లలో కేంద్ర బందం సభ్యుడు నవీన్ పర్యటించారు. పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థుల సంఖ్య తెలుసుకున్నారు. మరుగుదొడ్లు, మురికికాలువలు, సెగ్రిగేషన్ షెడ్లు, అంగన్వాడీ నిర్వహణపై ఆరా తీశారు. సర్పంచ్ గంట పద్మ, డీఎల్‌పీఓ రాంబాబు, ఎంపీడీవో రమేశ్, ఎంపీవో భాస్కర్, ఏపీఎం స్వరూపారాణి ఉన్నారు.

ధూళికట్టలో..

ఎలిగేడు: మండలంలోని ధూళికట్టలో నేషనల్ టీం సభ్యుడు సీహెచ్.రాకేశ్ పర్యటించారు. అభివృద్ధి పనులు, స్వచ్ఛతపై పరిశీలించారు. సర్పంచ్ గొల్లె కావేరి, ఎంపీటీసీ ఇరుగురాల సావిత్రమ్మ, ఎంపీడీవో శ్రీనివాసమూర్తి, ఎంపీవో అనిల్‌రెడ్డి పాల్గొన్నారు.

జూలపల్లిలో..

జూలపల్లి: మండలంలోని పెద్దాపూర్‌లో కేంద్ర బృందం సభ్యుడు జి.సునీల్‌కుమార్ పర్యటించారు. కేంద్రం నిధులతో చేపట్టిన పనులు, అమలవుతున్న పథకాలను పరిశీలించారు. గ్రామీణ ఆరోగ్య ఉపకేంద్రం నిర్వహణను తెలుసుకున్నారు. సర్పంచ్ కంకణాల భారతి, డీఎల్‌పీవో వేణుగోపాల్, ఎంపీడీవో వేణుగోపాలరావు, ఎంపీవో కిరణ్, ఏపీవో సదానందం ఉన్నారు.

గర్రెపల్లిలో..

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ మండలం గర్రెపల్లిలో సర్వే టీం సభ్యులు పర్యటించారు. ఇంటింటికీ తిరిగి మరుగుదొడ్లు, ఇంకుడుగుంతలు, చెత్త సేకరణను పరిశీలించారు. సర్పంచ్ వీరగోని సుజాత, ఎంపీడీఓ శశికళ, ఎంపీటీసీ పులి అనూష, ఎంపీఓ ఫయాజ్‌అలీ ఉన్నారు.

ఓటు వినియోగంపై ప్రచారం చేయాలి

- ఈనెల 19న 5కె రన్
- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



మాట్లాడుతున్న కలెక్టర్, అడిషనల్ కలెక్టర్

పెద్దపల్లిరూరల్: ప్రతి ఓటరు తమ ఓటుహక్కును వినియోగించుకునేలా విస్తృత ప్రచారం చేయాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. రాష్ట్ర ఎన్నికల జాయింట్ ప్రధాన అధికారి సర్ఫరాజ్ అహ్మద్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో కలెక్టర్ అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్‌తో కలిసి పాల్గొన్నారు. కొత్త ఓటర్లకు గుర్తింపు కార్డులు అందించేలా చర్యలు తీసుకోవాలని, ఓటుహక్కు ప్రాముఖ్యతను వివరించేలా చూడాలని పేర్కొన్నారు. ఈనెల 19న అసెంబ్లీ కేంద్రాల్లో 5కె రన్‌కు ఏర్పాట్లు చేయాలని సూచించారు. మంథని ఆర్డీఓ హనుమనాయక్, జిల్లా సంక్షేమ అధికారి రవుఫ్‌ఖాన్, ప్రకాశ్, డీటీ ప్రవీణ్ తదితరులున్నారు.

ధరణి సమస్యలపై...

ధరణి సమస్యలపై మీసేవ కేంద్రాల నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ అన్నారు. మీసేవ నిర్వాహకులతో సమీక్షించారు. జిల్లావ్యాప్తంగా దాదాపు 4 వేల ధరణి దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, నిర్వాహకులు సరైన మాడ్యూల్‌లలో దరఖాస్తులు నమోదు చేయాలని, సమస్యలుంటే కలెక్టరేట్‌ని సహాయక కేంద్రంలో సంప్రదించాలని సూచించారు. ధరణి సహాయ కేంద్రం నంబర్ 79950 70677లో పనివేళల్లో సంప్రదించి నివృత్తి చేసుకోవచ్చన్నారు. మీసేవ నిర్వాహకులు కొందరు అధికంగా వసూలు చేస్తున్నారని, వారంతా పద్ధతి మార్చుకోవాలని అడిషనల్ కలెక్టర్ సూచించారు. నిర్దేశిత రుసుం, వివరాలు ప్రదర్శించాలన్నారు. ఈడీఎం కవిత, మీసేవ కేంద్ర నిర్వాహకులు పాల్గొన్నారు.

కార్మికులకు 11వ వేతన బకాయిలు చెల్లించాలి



గోదావరిఖని: సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారానికి ఐఎఫ్‌టీయూ అనుబంధ గోదావరిలోయ బొగ్గు గని కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టనున్నట్లు ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కే.విశ్వనాథ్ తెలిపారు. తిలక్‌నగర్‌లోని యూనియన్ కార్యాలయంలో మాట్లాడారు. సీఎం కేసీఆర్ ప్రకటించిన రూ.700 కోట్లను ఆగస్టు వేతనం, 11వ వేతన ఏరియర్స్ చెల్లించాలని డిమాండ్ చేశారు. అన్ని గనులపై ఈనెల 25 వరకు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టనున్నట్లు ప్రకటించారు. సంపత్, మురళి, అయిలయ్య, తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి శ్రీఆదివరాహస్వామికి శ్రావణ పూజలు



శ్రీఆదివరాహస్వామివారు

కమాన్‌పూర్(మంథని): మండలకేంద్రంలో స్వయంభూగా వెలిసిన శ్రీఆదివరాహస్వామి ఆలయంలో శుక్రవారం నుంచి శ్రావణమాసం ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు భక్తుల కోసం ఆలయ చైర్మన్ ఇనగంటి ప్రేమలత, ఈవో కాంతారెడ్డి ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్సవాలకు రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, జెడ్పీ చైర్మన్లు, ప్రముఖులు హాజరుకానున్నారు. స్వామివారిని శ్రావణంలో దర్శించుకుంటే మంచి జరుగుతుందని భక్తుల విశ్వాసం.

27 నుంచి జయంతి ఉత్సవాలు

ఈనెల 27 నుంచి మూడురోజులపాటు స్వామివారి జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని ఆలయ చైర్‌పర్సన్ ప్రేమలత తెలిపారు. క్యూలైన్, తాగునీటి ఏర్పాటు, వాహనాలకు పార్కింగ్ వంటి ఏర్పాట్లు చేశామన్నారు.

జెడ్పీ చైర్మన్‌కు ఆహ్వాన పత్రిక అందజేత

శ్రీఆదివరాహస్వామి జయంతి ఉత్సవాలకు హాజరుకావాలని కోరుతూ జెడ్పీ చైర్మన్‌కు బుధవారం ఆలయ చైర్మన్, ఈవో, అర్చకులు వరప్రసాదాచార్యులు ఆహ్వాన పత్రిక అందించారు.


రూ.లక్ష సాయంలో గౌడ కులస్తులను చేర్చాలి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట గౌడ కులస్తులు

కాల్వశ్రీరాంపూర్: రాష్ట్రప్రభుత్వం బీసీ కులవృత్తులకు ప్రకటించిన రూ.లక్ష సాయంలో గౌడ కులస్తులను చేర్చాలని డిమాండ్ చేస్తూ బుధవారం తహసీల్దార్ కార్యాలయం ముందు ఆందోళన చేశారు. ముందుగా బస్టాండ్ చౌరస్తాలో సమావేశమయ్యారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. తహసీల్దార్ కార్యాలయం వరకు ముత్తాదులతో ర్యాలీ నిర్వహించారు. మాజీ ఎంపీపీ సారయ్యగౌడ్, బీజేపీ జిల్లా నాయకుడు ఏగోళపు సదయ్యగౌడ్, గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు వేగోలం శంకర్ గౌడ్, మండల అధ్యక్షుడు వెంకట్రాజం మాట్లాడుతూ.. గీతవృత్తిని నమ్ముకున్న గౌడ కులస్తులను ప్రభుత్వం విస్మరించడం తగదన్నారు. తమ కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ జాహెద్‌పాషాకు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో పెగడపల్లి, పెద్దరాతుపల్లి సర్పంచులు ఆరెల్లి సుజాత, ఓరుగంటి కొమురయ్యగౌడ్, నాయకులు మొగిలిగౌడ్, సదానందం గౌడ్, అశోక్ గౌడ్, దేవేందర్‌గౌడ్, సాయికిశోర్, విష్ణువర్ధన్ గౌడ్, తిరుపతి గౌడ్, రమేశ్ గౌడ్, కాసగోని కొమురయ్య గౌడ్ పాల్గొన్నారు.

లోడింగ్‌కు లోకల్ లారీలకు అవకాశమివ్వాలి



పూసల రైస్‌మిల్ అసోసియేషన్ ముందు నిరసన తెలుపుతున్న లారీఓనర్లు

సుల్తానాబాద్: రైస్‌మిల్లులకు ధాన్యం, బియ్యం లోడింగ్, అన్‌లోడింగ్‌కు లోకల్ లారీలకు అవకాశం ఇవ్వాలని లారీ ఓనర్ల వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కంకణాల తిరుపతి కోరారు. మండలకేంద్రంలోని పూసాల రైస్‌మిల్ అసోసియేషన్ ముందు బుధవారం నిరసన చేపట్టారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయవాడ, కాకినాడ ప్రాంతాల నుంచి లారీలను తీసుకొచ్చి బియ్యం సరఫరా చేస్తున్నారని, 20రోజుల నుంచి తమ లారీలకు పని దొరకడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. లోకల్ లారీలకు లోడింగ్, అన్‌లోడింగ్‌కు అవకాశం ఇచ్చేలా ఎంవీఐ, పోలీసులు, స్థానిక ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు. సంఘం ప్రధాన కార్యదర్శి నగునూరి నాగరాజు, ఉపాధ్యక్షుడు ఈసారపు రవీందర్, గంద్ర రమేశ్‌రావు, పొన్నం శ్రీనివాస్, కోశాధికారి కనవేని సతీశ్, జాయింట్ సెక్రెటరీ శ్యాంసుందర్, సుంకిశాల తిరుపతిరావు, సీపతి రాజు, శ్రీనివాస్, శ్రావణ్, సందీప్ రావు, రౌతు రవీందర్ ఉన్నారు.

ఆంధ్ర లారీ అడ్డగింత

కాకినాడకు చెందిన ఓ లారీ సుల్తానాబాద్ నుంచి బియ్యం లోడ్‌తో వెళ్తుండగా లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు అడ్డుకున్నారు. తమ ప్రాంతానికి వచ్చి ఉపాధి దెబ్బతీయొద్దని సూచించారు. ఆంధ్ర నుంచి అన్‌లోడింగ్‌కు వచ్చామని, ఇక్కడి నుంచి లోడింగ్ ఉందని చెబితే వచ్చామని డ్రైవర్ పేర్కొన్నాడు.

క్లుప్తంగా

నూతన నియామకం


శ్రావణ్ కుమారా చార్య

జ్యోతినగర్: జిల్లా అర్చక సంఘం ఉపాధ్యక్షుడిగా ఏటూరి శ్రావణ్ కుమారా చార్యను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు నిట్టూరి సతీష్‌శర్మ, గౌరవ అధ్యక్షుడు ఆంజనేయ చార్య, తెలంగాణ అర్చక ఉద్యోగ వెల్ఫేర్‌బోర్డు సభ్యుడు జక్కపూర్ నారాయణ స్వామి నియామక పత్రం విడుదలచేశారు. రామగుండం కార్పొరేషన్ మూడో డివిజన్ జంగాలపల్లెకు చెందిన ఏటూరి శ్రావణ్ కుమారా చార్య తెలంగాణ ధూపదీప నైవేద్య అర్చక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమించారు. ఈ సందర్భంగా శ్రావణ్‌కుమారా చార్యను స్థానిక అర్చకులు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. తన నియమకానికి సహకరించిన రాష్ట్ర, జిల్లా నాయకులకు శ్రావణ్ కుమారాచార్య కృతజ్ఞతలు తెలిపారు.

దాడి కేసులో నల్లురిపై కేసు

ధర్మారం: మండలంలోని కటికెనపల్లిలో గొల్లపెల్లి మండలకేంద్రానికి చెందిన వనం స్వామిపై దాడిచేసిన నల్లురిపై బుధవారం కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ధర్మారం ఎస్సై సత్యారాయణ తెలిపారు. కటికెనపల్లిలో స్వామి సెప్టిక్‌ట్యాంక్ క్లీనింగ్ గురించి గోడలపై వాల్‌రైటింగ్ చేస్తుండగా కరీంనగర్‌కు చెందిన దాసరి గంగయ్య, దాసరి మంజుల, దాసరి అంజయ్య, వనం వెంకటేశ్‌లు వచ్చి తమకు చెందిన కటికెనపల్లిలో వాల్ రైటింగ్ ఎందుకు చేస్తున్నావని ప్రశ్నిస్తునే స్వామిని దుర్భాషలాడుతూ కట్టెలు, కత్తితో దాడిచేయగా తీవ్ర గాయాలపాలయ్యాడు. ఈ ఘటనపై స్వామి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్సపొందుతూ వ్యక్తి మృతి


తిరుపతి(ఫైల్)

ముత్తారం: మండలంలోని ఓడేడు పరిధి వెంకటేశ్వర్ల పల్లెకు చెందిన భూక్య తిరుపతి (26) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు, ఎస్సై మధుసూదన్‌రావు కథనం ప్రకారం.. తిరుపతి రెండేళ్ల క్రితం ఇల్లు నిర్మించుకున్నాడు. ఇందుకు అప్పు చేశాడు. ఆ అప్పు తీర్చేమార్గం కానరాక ఈనెల 14న పురుగుల మందుతాగి ఇంటికి వచ్చి కుటుంబ సభ్యులకు తెలిపాడు. దీంతో అతడిని ముత్తారంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడినుంచి కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు ప్రయత్నించినా ఫలితం కనిపించలేదు. తిరుపతికి ఒక కూతురు ఉంది. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

శ్రావణం..శుభకరం

- నేటినుంచి శ్రావణ మాసం ప్రారంభం



జ్యోతినగర్: శ్రావణమాసం అందరికీ శుభకరం. నేటినుంచి ప్రతీ ఇల్లు ఆలయాలను తలపిస్తుంటాయి. శ్రావణంలోని అన్నిరోజులు ఉదయం, సాయంత్రం భగవన్నామస్మరణతో మార్మోగుతుంటాయి. శ్రావణంలో చేపట్టే ఏ కార్యక్రమానికైనా ఎంతో పవిత్రత ఉంటుందంటున్నారు పండితులు. అంత గొప్ప పవిత్రమాసం గురువారం నుంచి ప్రారంభమవుతోంది. ఎన్నో మంచిరోజులు, విశిష్ట పండుగలు వస్తుండడంతో శ్రావణ మాసానికి అంత ప్రత్యేకత చేకూరనుంది.

- సనాతన ధర్మంలో (హిందూ) చంద్రమానం ప్రకారం మనకున్న పన్నెండు మాసాల్లో ఐదవది ఎంతో పవిత్రత కలిగింది శ్రావణమాసం. ఈ నెలలో పౌర్ణమినాడు చంద్రుడు శ్రావణ నక్షత్రంలో సంచరిస్తుండడంతో ఈ మాసానికి శ్రావణమాసం అని పేరు వచ్చింది.
- శ్రావణ మాసంలో వివిధ రకాల పూజలు, వ్రతాలు ఆచరించడం వల్ల విశేష ఫలితాలు ఉంటాయని పెద్దలు చెబుతుంటారు. ఈ మాసంలో చేసే దైవ కార్యాలకు ఎంతో శక్తి ఉంటుందని వేద పురాణాలు చెబుతున్నాయి.

శివారాధనకు ఎంతో విశిష్టత



శ్రావణమాసం శివ పూజలకు విశిష్టమైనది. ముఖ్యంగా భగవతరాధనలో శివ, కేశవ భేదం లేకుండా పూజించడానికి విశేషమైనది. ఈ నెలలో చేసే ఏ చిన్న దైవకార్యమైనా కొన్నివేల రెట్లు శుభ ఫలితాన్నిస్తుందని ప్రతీతి. సోమవారాలు పగలంతా ఉపవాసం ఉంచి రాత్రివేళలో స్వామివారికి రుద్రాభిషేకాలు, బిల్వార్చనలు చేస్తే పాపాలు పోతాయని శాస్త్రవచనం. శ్రావణంలో 15 రోజులు ఎంతో విశేషమైన రోజులనీ ఒక్కోరోజు ఒక్కో దేవుడికి పూజలు చేయాలని వేదశాస్త్రాలు చెబుతున్నాయి. ఈ మాసంలో భక్తితో ఆచరించే ప్రతీ పూజకు తగిన ప్రతిఫలం ఉంటుందంటున్నారు పండితులు.

మంగళ గౌరీ వ్రతం

శ్రావణ మాసంలో అన్ని మంగళవారల్లో చేసే వ్రతమే మంగళగౌరీ వ్రతం. దీన్ని శ్రావణ మంగళవార వ్రతం అని, మంగళగౌరీ నోము అని వివిధ రకాలుగా పిలుస్తుంటారు. ఈ వ్రతాన్ని కొత్తగా పెళ్లైన వారు ఆచరించాలి. వివాహమైన తర్వాత వచ్చే శ్రావణంలో ఈ వ్రతాన్ని చేయడం ప్రారంభించాలి. శ్రావణమాసంలో వచ్చే అన్ని మంగళవారాల్లో ఈ వ్రతం క్రమం తప్పకుండా చేయాలి. ఐదేళ్ల మంగళగౌరీ వ్రతాన్ని ఆచరించి ఉద్యాపన చేయాలి. దీంతో వారు నిండు సుమంగళిగా ఉంటారని, వారి కుటుంబంలో సుఖశాంతులు, అష్ట ఐశ్వర్యాలు ఉంటాయి.

వరలక్ష్మీ వ్రతం

శ్రావణమాసంలో పూర్ణిమకు ముందు వచ్చే శుక్రవారం ఈ వ్రతం చేయాలి. ఒకవేళ అప్పుడు వీలుకాకుంటే శ్రావణ మాసంలో మరో శుక్రవారమైనా ఈ వ్రతం చేయొచ్చు. పూజ మండపంలో నిండు కలశాన్ని ఏర్పాటు చేసి దానికి వరలక్ష్మీ దేవి ముఖప్రతిమను అలంకరించి పూజ చేయాలి. తర్వాత తొమ్మిది ముడులతో తోరణాన్ని తయారు చేసి పూజ చేసిన అనంతరం ఈ శ్లోకాన్ని ప్రకటించాలి.



శ్రావణ మాసం విశిష్టతలు

శుక్ల ద్వాదశి, దామోదర ద్వాదశి అని ఈ మాసంలో రెండు శుభ దినాలున్నాయి. శుక్ల పక్ష ఏకాదశి నాడు ఉపవాసం ఉండి మహావిష్ణువును పూజిస్తే మోక్షం లభిస్తుంది. శ్రావణ మాసంలో అన్నిశుభాలే కలుగుతాయి.

శుక్లపక్ష పౌర్ణమి

శ్రావణపౌర్ణమి, రాఖీ పౌర్ణమిగా జరుపుకునే ఈ రోజు సోదర, సోదరీ బంధానికి సూచికగా రక్షాబంధనం జరుపుకుంటున్నాం. అంతేకాకుండా ఈ రోజున నూతన యజ్ఞోపవిత్రధారణ, వేదభ్యాసాన్ని ప్రారంభిస్తారు.

శ్రావణమాసం శుభకరం



శ్రావణ మాసం అందరికి శుభకరం. వ్రతాలు ఆచరిస్తే శుభాలు కలుగుతాయి. చాలా పండుగలు కూడా ఈనెలలో వస్తాయి. నిష్ఠతో పూజలు చేసి భగవంతుడి కృపకు పాత్రులు కాగలరు.

– రుద్రభట్ల సత్యనారాయణ, అర్చకులు, మల్కాపూర్

పోలీస్ స్టేషన్లలో సెక్షన్ ఇన్‌చార్జ్ విధులు కీలకం

- గోదావరిఖని ఏసీపీ తులా శ్రీనివాస్



జూమ్ మీటింగ్‌లో పాల్గొన్న పోలీస్ అధికారులు

గోదావరిఖని: ప్రజా రక్షణలో భాగంగా ప్రతీ పోలీస్‌స్టేషన్లలో సెక్షన్ ఇన్‌చార్జి విధులు కీలకమని వర్టికల్ ఇన్‌చార్జి గోదావరిఖని ఏసీపీ తులా శ్రీనివాస్ అన్నారు. బుధవారం రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్లలో సెక్షన్ ఇన్‌చార్జి విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బందితో జూమ్ మీటింగ్ నిర్వహించి మాట్లాడారు. విధి నిర్వహణలో అప్పగించిన విధుల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. సెక్షన్ ఇన్‌చార్జి విధులు నిర్వర్తించే అధికారులు క్రమశిక్షణ సమయపాలన వృత్తిపై నిబద్ధత, విధేయత కలిగి ఉండాలన్నారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగే అన్ని నేరాలపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని, నేరాల నియంత్రణకు ఉన్నతాధికారుల సూచనలు పాటించాలన్నారు. పోలీస్‌స్టేషన్‌లోని సిబ్బంది విధులను కేటాయించడంలో సమర్థవంతంగా వ్యవహరించాలని కోరారు. బీట్, పెట్రోల్, బ్లూకోల్ట్స్ సిబ్బందిని సమన్వయం చేస్తూ సమస్యల పరిష్కారానికి సిబ్బందికి ఎప్పటికప్పుడు సూచనలు అందించాలన్నారు.

ఆయిల్ పాం సాగుతో అధిక లాభాలు


ఆయిల్‌పామ్ మొక్కలు నాటుతున్న జగన్మోహన్‌రెడ్డి, కార్పొరేటర్లు

జ్యోతినగర్: ఆయిల్ పామ్ సాగుతో అధికలాభాలు, దిగబడులు పొందవచ్చని జిల్లా ఉద్యానవనాధికారి జగన్మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం రామగుండం కార్పొరేషన్ ఐదో డివిజన్‌లో కార్పొరేటర్ కృష్ణవేణి అధ్యక్షతన నిర్వహించిన ఆయిల్ పామ్ తోటలపై అవగాహన కల్పించి ఆకుల రాజారామ్ తోటలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆయిల్‌పామ్‌తోటలో చీడపీడలపై సాగు పెంపకంపై, ఆయిల్‌మొక్కలు నాటి సాగు దిగుబడిపై రైతులకు వివరించారు. రైతుల సందేహాలను వ్యవసాయాధికారి ప్రకాశ్ నివృత్తి చేశారు. పంటసాగుకు సంబంధించిన సందేహాలుంటే వ్యవసాయశాఖ అధికారులను సంప్రదించాలన్నారు. కార్పొరేటర్లు కృష్ణవేణి, కవితా సరోజని, కుమ్మరి శ్రీనివాస్, తిరుమల ఆయిల్ పామ్ కెమికల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో కౌశిల్యా, కార్నర్ ఉద్యాన మండలాధికారి శ్రీకాంత్, ఏఈవో మహేందర్ బీటీఎం భూపతిరెడ్డి, ఫీల్డ్ ఆఫీసర్ రాజకుమార్, జెన్రిప్ కంపెనీ ఫీల్డ్ ఆఫీసర్ రాజు, రైతు సమన్వయ సమితి ప్రెసిడెంట్ ఓల్లపు రాజయ్య, రైతులు పాల్గొన్నారు.

మట్టిని తోడేస్తున్నారు..!

- రాత్రి, పగలు తేడా లేకుండా తవ్వకాలు
- ప్రభుత్వ భూములనూ వదలని అక్రమార్కులు
- పట్టించుకోని రెవెన్యూ, మైనింగ్ అధికారులు


ప్రభుత్వ భూమిలో మట్టి తీస్తున్న జేసీబీ (ఫైల్)

సుల్తానాబాద్‌రూరల్: గుట్టలు, ప్రభుత్వ భూములే లక్ష్యంగా భారీ యంత్రాలతో రాత్రి, పగలు తేడా లేకుండా మట్టి తవ్వుతూ సొమ్ము చేసుకుంటున్నారు అక్రమార్కులు. ఇళ్ల నిర్మాణాలకు, వెంచర్ల ఏర్పాటుకు మట్టికి డిమాండ్ ఉండటంతో సుల్తానాబాద్, ఎలిగేడు, ఓదెల, కాల్వశ్రీరాంపూర్, జూలపల్లి మండలాల్లో ఈ దందా యథేచ్ఛగా సాగిస్తున్నారు. రెవెన్యూ, మైనింగ్ అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి, అక్రమ మట్టి తరలింపునకు అడ్డుకట్ట వేసి, ప్రభుత్వానికి ఆదాయం వచ్చేలా చూడాలని కోరుతున్నారు.

నిబంధనలు ఇవి.. పట్టింపేదీ?

- పట్టా, అసైన్డ్ భూముల్లో మట్టి తవ్వకాలు చేపట్టాలంటే మైనింగ్, అటవీ, రెవెన్యూ అధికారుల అనుమతి తప్పనిసరి.
- వాల్టా చట్టం ప్రకారం ప్రభుత్వానికి పన్ను చెల్లించాలి.
- మట్టి ఉన్న ప్రాంతంలో ఎన్ని క్యూబిక్ మీటర్లకు లీజు ఇవ్వాలో రెవెన్యూ అధికారులు నిర్ణయిస్తారు.
- మైనింగ్ అధికారులు వే బిల్లు జారీ చేయాల్సి ఉంటుంది.
- తవ్వకాలు జరిపే ప్రాంతం ఆయా గ్రామపంచాయతీల కిందకు వస్తే పన్ను చెల్లించాలి.
- అక్రమార్కులు ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే మట్టిని తరలిస్తున్నారు.
- కొందరు తీసుకున్న క్యూబిక్ మీటర్ల కంటే ఎక్కువ మట్టిని తవ్వుతున్నారు.

అనుమతి లేకుండా తరలిస్తే చర్యలు

అనుమతి లేకుండా మట్టి తరలిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం. వాహనాలు సీజ్ చేసి, జరిమానా విధించి, కేసు నమోదు చేస్తాం. ఎవరైనా అక్రమంగా మట్టి తవ్వకాలు చేపడితే సమాచారం ఇవ్వాలి.

– మధుసూదన్ రెడ్డి, తహసీల్దార్, సుల్తానాబాద్

ప్రజా వ్యతిరేక విధానాలు తిప్పికొట్టాలి

- ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య


మాట్లాడుతున్న వాసిరెడ్డి సీతారామయ్య

యైటింక్లయిన్‌కాలనీ/రామగిరి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని ఏఐటీయూసీ ప్రధానకార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. బుధవారం ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీలోని కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన సింగరేణి వర్కర్స్ యూనియన్, ఏటీయూసీ ఆర్జీ–2 ఏరియా 5వ మహాసభలో, ఆర్జీ–3 డివిజన్ పరిధిలోని ఏపీఏలో ఏర్పాటుచేసిన గేట్ మీటింగ్‌లో పాల్గొని మాట్లాడారు. సింగరేణిలో ఎన్నికలు జరగకుండా రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకుంటోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలతో ప్రభుత్వ రంగసంస్థల్లో పని చేసే కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. కోల్ ఇండియా తరహాలో సింగరేణిలో కూడా కాంట్రాక్ట్ కార్మికులకు హైపవర్ వేతనాలు చేల్లించాలని డిమాండ్ చేశారు. సింగరేణి యాజమాన్యం వేలాది కోట్ల రూపాయిలను ప్రభుత్వానికి దారాదత్తం చేస్తోందన్నారు. కేసీఆర్ సీఎంగా కొనసాగినంతకాలం శ్రీధర్ సీఅండ్ఎండీగా కొనసాగుతారన్నారు. కార్మికుల హక్కుల కోసం టీబీజీకేఎస్ ఏనాడు పోరాటం చేయలేదని కానీ ఏఐటీయూసీ నిరంతరం కార్మికుల పక్షాన పోరాడుతోందని ఏఐటీయూసీని ఆదరించాలని కోరారు. కార్మికుల పిల్లలకు మెడికల్ కళాశాలలో 50శాతం సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈనెల 25, 26,27 తేదీల్లో నిర్వహించే మహాసభలకు కార్మికులు హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ జనరల్ సెక్రటరీ వైవీ.రావు, బ్రాంచ్ సెక్రటరీ ఎంఆర్‌సీ రెడ్డి, పీట్ సెక్రటరీ గంగాధర్, కందికట్ల సమ్మయ్య, రవికుమార్, ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్, ఎల్ ప్రకాష్, సదానందం, కడారి సునీల్, ఎల్లయ్య, స్వామి, బుర్ర తిరుపతి, రాజారత్నం, రాంచందర్, అన్నారావు, శ్యాంసన్, రవీందర్, సాంబశివ రావు, మహేందర్, సత్యనారాయణ కార్మికులు పాల్గొన్నారు.

జీఎం కార్యాలయం ఎదుట ధర్నా


ధర్నా నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు

రామగిరి: ఆర్జీ –3 డివిజన్ జీఎం కార్యాలయం ఎదుట బుధవారం ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులు ధర్నా నిర్వహించారు. ఏడో తేదీన వేతనాలు చెల్లించాలని, కార్మికులకు కనీస వేతనాలు కల్పించాలని, పీఎఫ్, వైద్యం తదితర వసతులు కల్పించాలని ధర్నానిర్వహించారు. అనంతరం డీజీఎం రవీందర్ రెడ్డికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకులు, కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

బీఎంఎస్ కృషితో సీఎంపీఎఫ్ భవిష్య నిధి

- ఆన్‌లైన్ సేవలు వినియోగించుకోవాలి
- యాదగిరి సత్తయ్య, బీఎంఎస్, అధ్యక్షుడు

గోదావరిఖని: బీఎంఎస్ కృషితో బొగ్గుగని కార్మికులకు సీఎంపీఎఫ్ భవిష్యనిధి సాధ్యమైందని ఫలితంగా ఆన్‌లైన్ సేవలు కొనసాగించేందుకు ఆదేశాలు జారీచేశారని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య వెల్లడించారు. భవిష్యనిధి నిలువలు అవినీతికి తావులేకుండా పారదర్శకంగా ఉండాలని బీఎంఎస్ జాతీయ నాయకులు కొత్త కాపు లక్ష్మారెడ్డితో పాటు ప్రతినిధుల బృందం సభ్యులు బొగ్గు గనుల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషిని కలిసి సీఎంపీఎఫ్ కమీషనర్‌ను కలవడంతో ఆన్‌లైన్ చేసేందుకు అధికారులకు ఆదేశాలు జారీచేశారని స్పష్టం చేశారు. సింగరేణి కార్మికులకు ఆన్‌లైన్ సేవలు సద్వినియోగం చేసుకోవాలని ఏమైనా సందేహాలుంటే బీఎంఎస్ కార్యాలయాల్లో కలవాలని కోరారు. ఆన్‌లైన్ సేవలు అధికారికంగా బొగ్గుగనుల శాఖ మంత్రి ప్రకటించే వరకు సవరణలు సరిచేసుకోవాలని తెలిపారు.

ఆర్జీ–2 ఏరియా సందర్శన


మ్యాప్‌ను పరిశీలిస్తున్న అధికారులు

గోదావరిఖని: ఆర్జీ–2ను జనరల్ మేనేజర్, సీపీఅండ్‌పీ జక్కం రమేశ్, ఏరియా జనరల్ మేనేజర్ మనోహర్‌తో కలిసి సందర్శించారు. బుధవారం జీఎం చాంబర్‌లో అధికారులతో సమావేశమయ్యారు. ఓసీపీ–3 ప్రాజెక్టు సర్వేమ్యాపు ద్వారా గని పనిస్థలాలను పరిశీలించి ఉత్పత్తిపై అధికారులతో సమీక్షించారు. బొగ్గు ఉత్పత్తి, ఓవర్ బర్డెన్ తొలగింపు వివరాలు తెలుసుకోవడంతో పాటు అధిక వర్షాలతో ఉత్పత్తి తగ్గినందున పెరుగుదలకు తీసుకోవాల్సిన జాగ్రత్తపై సూచనలు చేశారు. ఓసీపీ–3 వ్యూ పాయింట్ ద్వారా పనిస్థలాలను అధికారులతో కలిసి పరిశీలించారు. సమావేశంలో ఓసీపీ–3 ప్రాజెక్టు అధికారి మధుసూధన్, ఏరియా సర్వే అధికారి బూక్యా దేశాయి, నర్సింగరావు, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో నడిపిండు.. రైతును బలితీసుకుండు

- ట్రాక్టర్ కిందపడి అంబారిపేటవాసి దుర్మరణం
- పలుమార్లు పైనుంచి వెళ్లడంతో నుజ్జునుజ్జయిన మృతదేహం


పోచయ్య (ఫైల్)

వెల్గటూర్(ధర్మపురి): మద్యం తాగి వాహనాలు నడపరాదని పోలీసులు ఎంత అవగాహన కల్పించినా కొందరు వినడం లేదు. మద్యం మత్తులో ట్రాక్టర్ నడిపిన వ్యక్తి ఓ రైతును బలితీసుకున్నాడు. ఈ ఘటన జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలంలోని అంబారిపేట గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. అంబారిపేటకు చెందిన ముడిమడుగుల పోచయ్య(50) తన వ్యవసాయ పొలం దున్నడానికి మంగళవారం అదే గ్రామానికి చెందిన జాడి బానయ్యను పిలిచాడు. అతను అతిగా మద్యం తాగి, ఆ మత్తులో ట్రాక్టర్‌తో పొలం దున్నుతున్నాడు. వెనక ఉన్న పోచయ్యను గమనించకుండా వేగంగా నడపడంతో ట్రాక్టర్ అతన్ని తొక్కుకుంటూ వెళ్లింది. ఈ సంఘటనలో పోచయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ విషయాన్ని కూడా తెలుసుకోలేని స్థితిలో ఉన్న బానయ్య పలుమార్లు ట్రాక్టర్‌ను మృతదేహం పైనుంచి తిప్పడంతో నుజ్జునుజ్జయి, తల, మొండెం, కాళ్లు, చేతులు వేటికవే పూర్తిగా తెగిపోయాయి. పొలం దున్నడం పూర్తయిన తర్వాత పోచయ్య కనిపించడం లేదని అతని కుమారుడు సతీశ్‌కు చెప్పాడు. దీంతో కుటుంబసభ్యులు గ్రామంలో వెతకగా ఆచూకీ లభించలేదు. రాత్రి సమయంలో పొలంలో వెతకగా రక్తం, పోచయ్య శరీర భాగాలు కొద్దిగా కనిపించాయి. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. వారు బుధవారం పొలంలో పూర్తిగా తెగిపడిన మృతుడి శరీర భాగాలను బయటకు తీయించి, పోస్టుమార్టం చేయించారు. పోచయ్య కుమారుడి ఫిర్యాదు మేరకు ట్రాక్టర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి, అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. మద్యం తాగి, ట్రాక్టర్ నడిపి, పోచయ్య మృతికి కారణమైన బానయ్యపై కఠినచర్యలు తీసుకోవాలని మృతుడి కుటుంబసభ్యులు కోరుతున్నారు.

భూమి తమదేనంటూ బెదిరింపులు

- ప్రహరీ నిర్మాణం అడ్డగింత.. యజమానిపై దాడి
- అడ్డుకున్న స్థానికులు.. చెట్టుకు కట్టేసి పోలీసులకు అప్పగింత
- కరీంనగర్ జిల్లా చెంజర్ల గ్రామంలో ఘటన


ముగ్గురిని తాడుతో చెట్టుకు కట్టేసిన స్థానికులు

మానకొండూర్: తమకు సంబంధం లేని భూమిలోకి చొరబడి సదరు భూమి తమదేనంటూ ముగ్గురు వ్యక్తులు సీడ్ ప్లాంటు యజమానిని బెదిరించారు. అతడిపై దాడికి దిగారు. స్థానికులు అడ్డుకుని ఆ ముగ్గురిని చెట్టుకు కట్టేశారు. అనంతరం పోలీసులకు అప్పగించగా కేసు నమోదైన ఘటన కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం చెంజర్లలో బుధవారం చోటు చేసుకుంది. వివరాలు.. కరీంనగర్‌కు చెందిన గురిజాల జయరామయ్య మూడేళ్లక్రితం మానకొండూర్ మండలం చెంజర్ల శివారులో సర్వే నంబర్ 156లో 1.08 ఎకరాల భూమిని కరీంనగర్‌కు చెందిన బొమ్మవరం కిషన్‌రావు వద్ద కొనుగోలు చేసి, రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఆ భూమిలో సంఘమిత్ర సీడ్స్, కార్పొరేషన్ పేరిట గోదాం నిర్మించాడు. బుధవారం సీడ్ కంపెనీ చుట్టూ ప్రహరీ నిర్మాణం చేపడుతుండగా తిమ్మాపూర్ మండలం రేణికుంటకు చెందిన రాజుగౌడ్, కరుణాకర్, దివాకర్ అక్కడికి చేరుకున్నారు. ఆ భూమి తమదేనంటూ గోడ కట్టకుండా అడ్డుకున్నారు. చంపుతామని యజమానిపై దాడిచేశారు. చొక్కా చింపేసి, చంపుతామని బెదిరించారు. అక్కడే ఉన్న కొందరు స్థానికులు ఆ ముగ్గురిని చెట్టుకు బంధించారు. అనంతరం పోలీసులకు అప్పగించారు. సీడ్ ప్లాంటు యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సీఐ రాజ్ కుమార్ తెలిపారు.